కొండలు పిండేసి..
లే-అవుట్లుగా మార్చేసి

- కోట్లు కొల్లగొడుతున్న అక్రమార్కులు
- అధికార పార్టీ అండతో అక్రమ గ్రావెల్ దందా
- కన్నెత్తి చూడని రెవెన్యూ, మైన్స్ సిబ్బంది
- పోరంబోకు స్థలాలను ఆక్రమించి రియల్ ఎస్టేట్


రాంబిల్లి మండలం పంచదార్ల రెవెన్యూ పరిధి కొత్తూరులో గ్రావెల్ దందా


కొండకర్ల చీమలాపల్లి శివారులో గ్రావెల్ తవ్వేసి చదును


రాత్రిపూట గ్రావెల్ తవ్వకాలకు మరో ప్రాంతంలో గుట్టుగా దాచిపెట్టిన పొక్లెయిన్, జేసీబీ మెషినరీలు

అచ్యుతాపురం రూరల్: పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అచ్యుతాపురం, రాంబిల్లి పరిసర ప్రాంతాల్లో యథేచ్ఛగా గ్రావెల్ దందా కొనసాగుతోంది. ఇక్కడ నూతనంగా ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలకు, ఇళ్ల నిర్మాణాలకు ఇంకా కొన్ని ఖాళీ స్థలాల్లో ఎత్తు చేసుకోవడానికి మట్టి, గ్రావెల్ అత్యంత అవశ్యకమైనది. దీనిని ఆసరాగా తీసుకున్న గ్రావెల్ దొంగలు రాత్రిళ్లు మొదలు వేకువజాము వరకూ కొండలను, కొండా పోరంబోకు ప్రాంతాలను పొక్లెయిన్లు, జేసీబీల సహాయంతో తవ్వేసి టిప్పర్ లారీల్లో తరలిస్తున్నారు. అక్రమ గ్రావెల్ మైనింగ్‌తో రాత్రికి రాత్రే కుబేరులవుతున్నారు. ప్రధానంగా అచ్యుతాపురంలో కొండకర్ల, చోడపల్లి, నడింపల్లి, ఎం.జగన్నాథపురం, మళ్లవరం, ఎర్రవరం, ఉప్పవరం, రాంబిల్లి మండలంలో పంచదార్ల, వేల్పూరు, పెదకలవలాపల్లి, కొత్తపట్నం, వైలోవ, లాలంకోడూరు, రాజకోడూరు తదితర ప్రాంతాల్లో ఎక్కువగా గ్రావెల్ దందా జోరుగా సాగుతోంది. ఒక ట్రిప్ గ్రావెల్ లోడ్ రూ.8 వేలపైబడి అమ్మకాలు చేస్తున్నారు. గ్రావెల్ అక్రమార్కులు స్థానికులను మభ్య పెట్టడం, ప్రలోభాలకు గురిచేయడం, కుదరకపోతే భయభ్రాంతులు చేస్తూ అక్కడున్న కొండలను ఆక్రమించి మింగేస్తున్నారు. పదుల సంఖ్యలో భారీ టిప్పర్ లారీలతో గ్రావెల్ తరలింపులు చేస్తూ రాత్రిళ్లు రోజుకు 8 గంటల వ్యవధిలోనే ప్రభుత్వ ఆస్తి కొల్లగొట్టి లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. పెద్ద మొత్తాల్లో అధికారులకు, ప్రజా ప్రతినిధుల చేతులకు భారీగా నగదు ముట్టడంతో అటువైపు కన్నెత్తయినా చూడలేదన్న విమర్శలు ఎక్కువగానే ఉన్నాయి.

చెట్లు నరకడంతో పర్యావరణానికి భారీ ముప్పు

కొండ ప్రాంతాల్లో అక్రమంగా చెట్లు నరకడంతో పర్యావరణానికి భారీ ముప్పు వాటిల్లే అవకాశం ఎక్కువగా ఉంది. స్థానిక ఫెర్రో అలోయ్ పరిశ్రమలు, ఫార్మా పరిశ్రమలు, మరే ఇతర పరిశ్రమల కారణంగా ఇప్పటికే అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో వాతావరణంలో కాలుష్యం కారణంగా అనేక మార్పులు సంభవించాయి. వాయు కాలుష్యం, భూగర్భ జలాల కాలుష్యం వల్ల అనేక మంది తీవ్ర అనారోగ్యాలకు గురై ఆస్పత్రి పాలై మృత్యువాత పడుతున్నారు. కాలుష్యాన్ని కట్టడి చేసే చెట్లను యథేచ్ఛగా నరికేయడంతో వివిధ రకాల పక్షులు, జంతువులు అంతరించిపోయే అవకాశం ఎక్కువగా ఉందని వన్యప్రాణుల ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణ వాయువు ఇచ్చే చెట్లను నరకడంతో భవిష్యత్తులో మానవ మనుగడకు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం లేకపోలేదని వాతావరణ నిపుణులు, విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గ్రావెల్ దొంగలను కట్టడి చేయడానికి ప్రత్యేక అధికార బృందాల ఏర్పాటుతో నియంత్రణ చేసి అక్రమాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లాస్టిక్ నివారించాలి-పర్యావరణాన్ని కాపాడాలి

ఒకవైపు పర్యారవణం కాపాడే చెట్లను ఇష్టానుసారంగా నరికేస్తున్న వారిపై ఎటువంటి చర్యలు చేపట్టకుండా గ్రామాల్లో పర్యావరణంపై ఉత్తమమైన ప్రకటనలు చేయడం ఎంత వరకూ హర్షించదగ్గ విషయమని సీపీఎం నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది వరలో జగన్నాథపురంలో ప్లాస్టిక్ నివారించాలి - పర్యావరణాన్ని కాపాడాలని కలెక్టర్ చేసిన నినాదాలను గుర్తు చేశారు. కొండలను, వాగులను, గెడ్డలను మింగేస్తుంటే పోలీస్, రెవెన్యూ, మైన్స్ సిబ్బంది చోద్యం చూస్తున్నారని ధ్వజమెత్తారు. ఇటువంటి అక్రమాలకు పాల్పడుతున్న మట్టి, గ్రావెల్ దొంగలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని పర్యావరణాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.

కొండలను తవ్వి లే-అవుట్లుగా మారుస్తున్న రియల్టర్స్

కొండలను చదునుగా చేసి అక్కడున్న గ్రావెల్‌ను అమ్మేస్తున్నారు. ఆ ప్రాంతాన్ని లే-అవుట్లుగా మార్చి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారు. కొండలు, వాగులు, గెడ్డలు, పోరంబోకు ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించుకుని దర్జాగా లే-అవుట్లు వేసి రెండు చేతులా అక్రమంగా ఆర్జిస్తున్నారు. మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు దీనిపై పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. నాయకత్వం కేవలం ప్రభుత్వ ఆస్తులను దోచుకోవడానికే అన్న విధంగా అధికారం చేతులోకి రావడం తడవు, అక్రమాలకు అడ్డుకట్ట వేయలేనంత మాదిరిగా అక్రమార్కులు పేట్రేగి పోతున్నారు.


పూర్తిగా చదును చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సిద్ధంగా ఉంచిన కొండ, గెడ్డ పోరంబోకు స్థలం

క్లుప్తంగా

పోలీసు స్టేషన్‌లో రోల్ కాల్


రోల్ కాల్ నిర్వహిస్తున్న ఏఎస్ఐ గంగరాజు

కోటవురట్ల: స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐ గంగరాజు శుక్రవారం రోల్ కాల్ నిర్వహించారు. ఇందులో భాగంగా సిబ్బంది హాజరు తీసుకుని యూనిఫాం, ఇతర పరికరాలను తనిఖీ చేశారు. చట్టాలను వివరించి ఇటీవల కేసులు, సంఘటనలపై సమీక్ష చేశారు. పెట్రోల్ అసైన్‌మెంట్, షిఫ్టుల వివరాలు తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని, బాధితుల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు.

7న కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

కోటవురట్ల: 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను బీసీ, బ్రాహ్మణ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, కాపు, ఈబీసీ కార్పొరేషన్ల ద్వారా రుణాల మంజూరుకు ఈ నెల 7వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు శుక్రవారం తెలిపారు. కార్పొరేషన్ రుణాల కోసం మండలంలోని 25 గ్రామ పంచాయతీల నుంచి 367 మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. వీరికి మండల పరిషత్ సమావేశ మందిరంలో బ్యాంకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, అభ్యర్థులు ఉదయం 10 గంటలకు ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

ఆస్తి పన్నులో 5 శాతం రాయితీ

యలమంచిలి రూరల్: పట్టణంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ నెల 30వ తేదీలోగా పూర్తి ఆస్తి పన్ను చెల్లిస్తే, 5 శాతం రాయితీ వర్తిస్తుందని మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు తెలిపారు. ఈ నెల 6వ తేదీ తర్వాత కొత్త ఎసెస్మెంట్లు జనరేట్ అవుతాయన్నారు. ఆ తర్వాత 5 శాతం రాయితీతో పన్ను చెల్లింపులను స్వీకరించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు పురపాలక ద్వారా జీవో ఆర్టీ నంబరు 267 విడుదలైందన్నారు. ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వివాదాలను స్థానికంగా పరిష్కరించుకోవాలి


అర్జీదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

మునగపాక: చిన్న చిన్న వివాదాలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు కోరారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా పలు గ్రామాల నుంచి వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి ఇరువర్గాల వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాదాల జోలికి పోకుండా రెండు వర్గాల వారు సంయమనం పాటించి ప్రశాంత వాతావరణంలో నడుచుకోవాలన్నారు. తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, ఎంపీడీవో ఎం.ఉషారాణి, ఏఎస్ఐ దొర తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోటవురట్ల: కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రత్యేకాధికారి సరితాదేవి శుక్రవారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 11వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హత కలిగిన బాలికలు ధ్రువపత్రాలతో మీసేవా కేంద్రాలు, సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బడి మానేసిన బడిఈడు ఆడపిల్లలు, అనాథ పిల్లలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన అమ్మాయిలు సంబంధిత ధ్రువపత్రాలను జతపరచాలని తెలిపారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు


ఇంటర్వ్యూ చేస్తున్న ఎంపీడీవో జయప్రకాష్‌రావు

పాయకరావుపేట: కార్పొరేషన్ రుణాలు కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించామని ఎంపీడీవో ఎ.జయప్రకాష్‌రావు తెలిపారు. పట్టణంలో నాలుగు బ్యాంకులకు సంబంధించిన దరఖాస్తుదారులు సోమవారం తన కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఓసీ, బీసీ అభ్యర్థులు ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్లు, ఆధార్, పాటో పాన్‌కార్డులతో హాజరు కావాలన్నారు.

అంబేడ్కర్ జయంతి వేడుక పోస్టర్ విడుదల


పోస్టర్లను విడుదల చేస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: స్థానిక బీసీ కాలనీలో బీచ్ బాయ్స్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఈ నెల 14న ఘనంగా నిర్వహించాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను గురువారం రాత్రి దళితవాడలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ 14వ తేదీన బీసీ కాలనీలో బుర్రకథ, ఎగ్జిబిషన్, అంధుల ఆర్కెస్ట్రా, చిల్డ్రన్స్ డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అంబేడ్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు సౌజన్యంతో నిర్వహించే వేడుకలను విజయవంతం చేయాలన్నారు. కోనపల్లి రామ్మోహనరావు, దిమ్మల నూకరాజు, సీహెచ్ మురళి, తెరపల్లి భాస్కరరావు, కొత్తపల్లి సుర అనిల్, మాటూరి మహేష్, కణితి ఉమ, కొత్తపల్లి రామకృష్ణ, జంపా అరుణ్, మంత్రి శేఖర్, దిమ్మల సాయి పాల్గొన్నారు.

గిట్టుబాటయ్యేలా ఉపాధి వేతనం


ఉపాధి పనులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

నక్కపల్లి: ఉపాధి కూలీలకు వేసవిలో రోజుకు రూ.307 గిట్టుబాటయ్యే విధంగా వేతనం చెల్లిస్తున్నామని మండల ప్రత్యేకాధికారి ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన ఉపమాక పరిధి చెవిటి చెరువులో ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాబ్‌కార్డుదారులకు పనులు కల్పించాలని ఆదేశించారు. పనులు జరిగే చోట తాగునీరు, తదితర వసతి కల్పించాలన్నారు. మస్టర్లలో అవకతవకలు జరిగితే చర్యలు తీసుకుంటామన్నారు. కూలీల సమస్యలు తెలుసుకున్నారు. ఉదయం ఆరు గంటలకు హాజరయి కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, వైస్ ఎంపీపీ వీసం నానాజీ పాల్గొన్నారు.

సీతారామ కల్యాణానికి ఏర్పాట్లు


రంగులతో ముస్తాబైన సీతారామస్వామి ఆలయం

పాయకరావుపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో రామాలయాలు శ్రీరామనవమికి ముస్తాబవుతున్నాయి. ఆలయాలను రంగులతో అలంకరించి, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. తాటి కమ్మలతో చలువ పందిళ్లు వేశారు. ఆయా ఆలయ కమిటీ సభ్యులు సీతారాముల కల్యాణానికి తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలో మంగవరం రోడ్డులో సీతారామ స్వామి ఆలయంలో భక్తులు దర్శనార్థం తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వానరసేన సభ్యులు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 5 గంటలకు జరిగే స్వామివారి కల్యాణంలో పాల్గొనే దంపతులు ముందుగా ఆలయ కమిటీని సంప్రదించాలన్నారు. సోమవారం ఆలయంలో అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. విరాళాలు ఇచ్చే దాతలు కమిటీని సంప్రదించాలన్నారు.


అరబుపాలెంలోని రామాలయం

మునగపాక: మండలంలోని అరబుపాలెంలో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త బొడ్డేడ వెంకట సతీష్ తెలిపారు. భద్రాచలం రాములోరి కల్యాణం నిర్వహించే రీతిలో ఇక్కడ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నెల 6 నుంచి 13వ తేదీ వరకు పలు కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు సతీష్ తెలిపారు. గ్రామస్తుల సహకారంతో ఈ ఏడాది వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. మండలంలోని ఇతర గ్రామాల్లోనూ శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పందిళ్ల ఏర్పాటు వంటి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నెల 6వ తేదీన కల్యాణంతోపాటు అదేరోజు మధ్యాహ్నం అన్న సమారాధన, 8న రాత్రికి స్వామివారి రథోత్సవం, 11న చోరోత్సవం(దొంగవిల్లి), 12న నాగవల్లి (వసంతోత్సవం), 13న పుష్పయాగం నిర్వహిస్తామన్నారు.

భక్తి శ్రద్ధలతో పెళ్లిరాట మహోత్సవం


మునగపాకలో పెళ్లిరాట మహోత్సవంలో భక్తులు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లి, మూలపేట, మునగపాక తదితర గ్రామాల్లో శుక్రవారం సీతారాముల పెళ్లిరాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో భక్తి శ్రద్ధలతో రాట ఏర్పాటు చేశారు. మునగపాకలోని గౌరీపరమేశ్వరుల ఆలయ సన్నిధిలోని మహిళలు, స్థానికులు పెంటకోట వెంకట్, శ్రీనివాసరావు, ఆడారి రమణబాబు, సూరిబాబు, మళ్ల సంజీవరావు, దాడి పోలీసు, వెలగా వెంకటప్పారావు, ఆడారి కాశీబాబు, మళ్ల జగ్గప్పారావు, పెంటకోట రాము, పెంటకోట సత్యనారాయణ తదితరులు వేపచెట్టుకు పూజలు చేశారు. వాడ్రాపల్లిలో చిన రామస్వామి, మూలపేటలోని సీతారామచంద్రమూర్తి ఆలయ ప్రాంగణాల్లోనూ కల్యాణ రాట వేశారు.

ఆయిల్ పైపులైన్ల వద్ద జాగ్రత్తలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్ హేమంత్‌కుమార్

నక్కపల్లి: రైతుల పొలాల్లోకి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారు ఏర్పాటు చేసిన పైపులైన్ల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలని ఐవోసీఎల్ అచ్యుతాపురం విభాగం మేనేజర్ హేమంత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం దేవవరంలో రైతులకు అవగాహన కల్పించారు. దేవవరం, ఒడ్డిమెట్ట, గుంటపల్లి తదితర గ్రామాల పరిధిలో పైపులైన్లను పొలాల్లో వేశామన్నారు. పంటల వ్యర్థాలు, చెత్తకు నిప్పు పెట్టొద్దన్నారు. పైపులైన్ల నుంచి లీకేజీలు వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. పసుపు, మొక్కజొన్న, మిర్చి పెసర, పొగాకు, కంది, మినుమ తదితర అంతర పంటలు వేసుకోవచ్చన్నారు. పైపులైన్లు వెళ్లిన చోట బోర్లు, బావులు, చెరువులు తవ్వకూడదన్నారు. గృహ నిర్మాణం, షెడ్లు వంటివి ఏర్పాటు చేయరాదన్నారు. సర్పంచ్, మాజీ ఎంపీటీసీ జి. నర్సింహమూర్తి, మాజీ వైస్ సర్పంచ్ కొరిమి సూర్యగణేష్, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశువుల దాహార్తికి నీటి తొట్టెలు


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

ఎస్.రాయవరం: వేసవిలో పశువులు, పక్షుల దాహార్తి తీర్చడానికి నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తున్నట్టు సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు, సర్పంచ్ కర్రి సత్యనారాయణ తెలిపారు. తిమ్మాపురంలో ప్రభుత్వ భూమిలో సిమెంట్ తొట్టె నిర్మాణానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పశుసంవర్థ శాఖ సహాయకులు సునీల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సంధ్యారాణి, వీఆర్వో లోవతల్లి, రైతులు రాము, రమణ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఎస్.రాయవరం: పరవాడ 220 కేవీ సబ్ స్టేషన్‌లో సాధారణ నిర్వహణ పనులు నిమిత్తం ఎం.ఆర్.టి టెస్టింగ్ కారణంగా ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. కొరుప్రోలు 132 కేవీ, నర్సింగ్‌బిల్లి సబ్ స్టేషన్లకు వెళ్లే లైన్లలో క్లియరెన్స్ పనులు చేపడతామన్నారు. ఈ మేరకు ఎస్.రాయవరం, నక్కపల్లి, యలమంచిలి మండలాల పరిధిలో అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా సమయాలు మార్పు ఉంటుందన్నారు.

తాగునీరు కలుషితం

ఎస్.రాయవరం: గొట్టివాడ పైలట్ ప్రాజెక్టు నుంచి సరఫరా అయ్యే తాగునీరు తరచూ కలుషితమవుతోంది. పెదగుమ్ములూరు శివారు నీలాద్రిపురం వద్ద ట్యాప్ నుంచి నిత్యం తాగునీరు సరఫరా అవుతోంది. ఈ నీరు తరచూ కలుషితమవుతూ నల్లని రంగులోకి మారుతోందని ప్రజలు వాపోతున్నారు. ఈ ప్రాజెక్టు నుంచి ఎస్.రాయవరం, నక్కపల్లి, కోటవురట్ల మండలాల్లో 50 గ్రామాలకుపైగా తాగునీరు సరఫరా అవుతోంది. నీటిని విడుదల చేసే సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఇటువంటి కలుషిత నీరు వస్తుందని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తాగునీరు కలుషితం కాకుండా చూడాలని కోరుతున్నారు.

పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుల నియామకం

అచ్యుతాపురం రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు యలమంచిలి నియోజకవర్గంలో యువజన విభాగం మండల అధ్యక్షులుగా నియామకాలు చేపట్టారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. యలమంచిలి మండల యువజన విభాగం అధ్యక్షుడిగా పడాల శ్రీనివాసరావు, రాంబిల్లి మండల యువజన విభాగం అధ్యక్షుడిగా దూళి వెంకటరావు, అచ్యుతాపురం మండల యువజన విభాగం అధ్యక్షుడిగా కారుకుండి శ్రీను, మునగపాక మండల యువజన విభాగం అధ్యక్షుడిగా బొడ్డేడ లిలీప్ కుమార్‌లను నియమించారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల వెల్లువ


విరాళం అందజేస్తున్న డాక్టర్ సూర్యనారాయణ

మునగపాక: కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మళ్ల సంజీవరావు కోరారు. మునగపాకకు చెందిన డాక్టర్ బద్దెం సూర్యనారాయణ శుక్రవారం ఆలయ నిర్మాణానికి తనవంతు సాయంగా రూ.22,239, విశాఖకు చెందిన చదరం సన్నిబాబు రూ.10,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సంజీవరావు మాట్లాడుతూ రూ.5 కోట్లతో నిర్మిస్తున్న ఆలయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దిమ్మల అప్పారావు, పొలిమేర కృష్ణ, పెంటకోట ఉమేష్, ఆడారి కాశీబాబు, విల్లూరి నూక నరసింగరావు, చంద్రపాటి లోకేష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామంగా వెంకటాపురం


అధికారుల నుంచి ప్రగతిని తెలుసుకుంటున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

మునగపాక: ప్లాస్టిక్ రహిత గ్రామంగా వెంకటాపురం తయారు కావాలని మండల ప్రత్యేకాధికారి జి.ప్రభాకరరావు తెలిపారు. మండలంలోని వెంకటాపురం గ్రామాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. అనంతరం అధికారులతో సమావేశమై మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం సక్రమంగా అమలు చేయాలని, ప్లాస్టిక్ వినియోగం తగ్గేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్వహించాలన్నారు. సర్పంచ్ సుందరపు తాతాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, ఈవోపీఆర్డీ సోమరాజు, మండల ఇంజనీరింగ్ అధికారి గులామ్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

నాలుగు రెట్లు పరిహారంగా టీడీఆర్ బాండ్లు



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న నిర్వాసితులు

అచ్యుతాపురం రూరల్: భూమి కోల్పోయిన రైతులకు నిర్ణయించిన మొత్తం నాలుగు రెట్లు టీడీఆర్ బాండ్ల రూపంలో ఇవ్వనున్నట్లు అనకాపల్లి ఆర్డీవో షేక్ అయిషా తెలిపారు. మండలంలో చోడపల్లి, కొండకర్ల పంచాయతీ ప్రజలతో శుక్రవారం ఆమె టీడీఆర్ బాండ్లపై అవగాహన కల్పించారు. స్ట్రక్చర్, గృహం కోల్పోయిన వారికి స్ట్రక్చర్ వేల్యూషన్ ప్రకారం అమౌంట్ ఇస్తామన్నారు. వీసీపీఐఆర్ డిప్యూటీ డైరెక్టర్ ఎ.ఎస్. చైతన్య, వీఎంఆర్‌డీఏ ఏపీవో అమ్మాజీ రావు, పీసీపీఐఆర్ ఏపీవో రేవతి, తహశీల్దార్ వరహాలు, డీటీ శ్యామ్ పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్లను వ్యతిరేకించిన నిర్వాసితులు

రెండు గ్రామాల నిర్వాసితులు టీడీఆర్ బాండ్లకు వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. టీడీఆర్ బాండ్లు వద్దు, నగదు ముద్దు అంటూ నినాదాలు చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, పునరావాసం కల్పించాలని కోరారు. అనంతరం ఆర్డీవో అయిషాకు నిర్వాసితుల సంఘం కన్వీనర్ రొంగలి రాము, ఎస్.బ్రహ్మాజీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు.

పాయకరావుపేట ఏఎంసీ చైర్మన్‌గా దేవర


సత్యనారాయణ

నక్కపల్లి: పాయకరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నక్కపల్లి మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ నియమితులయ్యారు. శుక్రవారం కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో ఆయనకు అవకాశం కల్పించింది. నక్కపల్లి మండలం దేవవరం గ్రామానికి చెందిన సత్యనారాయణ గతంలో మండల పరిషత్ అధ్యక్షుడిగా, సర్పంచ్‌గా, గొర్రెల పెంపకందారుల సహకార సంఘం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు.

మద్యం విక్రేత అరెస్టు


నిందితుడితో ఎస్ఐ గణేష్, సిబ్బంది

అనకాపల్లి/తుమ్మపాల: బెల్టుషాపుపై దాడి చేసి 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిందితుడిని పట్టుకున్నట్లు సీఐ వైఎల్ నాయుడు శుక్రవారం తెలిపారు. మండలంలో మారేడుపూడి గ్రామ శివారులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు దాడులు చేయగా, నిందితుడు పీత త్రినాథ్‌ను పట్టుకున్నామన్నారు. అతడిపై కేసు నమోదు చేశామన్నారు.